# నూరు శాతం ఆస్తి పన్ను వసూళ్లు జరగాలి

## -కమిషనర్ పులి శ్రీనివాసులు

**గుంటూరు కార్పొరేషన్,మార్చి2,ప్రభాతవార్త :** ఐఎఎస్ గారు గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్ను నూరు శాతం వసూళ్లు జరగాల్సిందేనని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఎఎస్ గారు ఆదివారం సెట్ కాన్ఫరెన్స్ ద్వారా డిప్యూటీ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు, ఇన్స్పెక్టర్లు, అడ్మిన్ కార్యదర్శులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ గారు మాట్లాడుతూ, మార్చి నెల ప్రారంభమైనందున రెవెన్యూ విభాగ ప్రతి అధికారి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పన్ను బకాయి ఉన్న ప్రైవేట్ ఆస్తుల్లో రూ.165 కోట్లకు ఇప్పటి వరకు రూ.90 కోట్లు వసూళ్లు జరిగిందని, మార్చి చివరికి మరో రూ.50 కోట్లు వసూళ్లు చేయాలన్నారు. పన్ను వసూళ్లకు రెవెన్యూ ఇన్స్పెక్టర్, రెవెన్యూ అధికారి, డిప్యూటీ కమిషనర్ల వారీగా రోజువారీ లక్ష్యాన్ని నిర్దేశించామని, అందుకు తగిన విధంగా క్షేత్ర స్థాయిలో వసూళ్లు జరగాలన్నారు. పెద్ద మొత్తంలో బకాయిలు ఉన్న వాటికి డిప్యూటీ కమిషనర్లు భాధ్యత తీసుకోవాలని, పన్ను వసూళ్లు అధిక ప్రాధాన్యత అయినందున విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.గుంటూరు నగర ప్రజలు తమ ఆస్తి, ఖాళీ స్థల, నీటి కుళాయి చార్జీలను సకాలంలో చెల్లించాలని, తద్వారా నగరంలో అభివృద్ధి పనులు వేగంగా జరిగేందుకు వీలు కల్గుతుందన్నారు. ఇప్పటికే 202425 రెండవ అర్ధ సంవత్సరం చివరికి వచ్చామని, నెలాఖరు వరకు వేచి ఉండకుండా నగరపాలక సంస్థకు బకాయిలు మొత్తం చెల్లించాలని, ఏప్రిల్ 1 నుండి పన్ను పై నెలకు రూ.100కు రూ.2 వడ్డీ జమ అవుతుందన్నారు. మార్చి నెలలో సెలవు రోజుల్లో కుడా క్యాష్ కౌంటర్లు యధావిధిగా పని చేస్తాయని, పన్నులను జిఎంసి ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంల్లోని క్యాష్ కౌంటర్లతో పాటుగా, భారత్ పేటలోని 140 సచివాలయంలోని క్యాష్ కౌంటర్లలో చెల్లించవచ్చన్నారు. కావున నగర పాలకసంస్థకు చెల్లించవలసిన ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలం పన్ను, నీటి మీటర్ చార్జిలు, డి అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ లు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు.



# లింగంగుంట్ల భూములకు త్వరలోనే పరిష్కారం : ఎమ్మెల్యే డాక్టర్ అరవింద్‌బాబు

**నరసరావుపేట, మార్చి 2 ప్రభాతవార్త :** మండలంలోని లింగంగుంట్ల గ్రామ పరిధిలో ఉన్న పుష్కగిరి పీఠానికి సంబంధించి అగ్రహారం భూములకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. ఆదివారం హైదరాబాద్ పుష్పగిరి మఠంలో పీఠాధిపతులను తనతో పాటు పార్లమెంట్‌సభ్యులు లావు శ్రీకృష్ణదేవ రాయలు కలవడం జరిగిందన్నారు. భూముల రిజిస్ట్రేషన్‌లకు సంబంధించి వారితో చర్చించామన్నారు. రిజిస్ట్రేషన్‌ల ను ప్రారంభించేందుకు ఉన్న అభ్యంతరాలపై రైతులతో మాట్లాడి వారికి అనుకూలంగా చేయూతనిస్తామని పీఠాధిపతులు తెలియజేశారన్నారు. పీఠాధిపతులు సానుకూలంగా స్పందించడం పట్ల ఎమ్మెల్యే అరవింద్‌బాబు హర్షం వ్యక్తం చేశారు. త్వరలోనే రిజిస్ట్రేషన్లకు ముహూర్తం నిర్ణయిస్తామన్నారు. దశాబ్దాలుగా రైతులు సాగు చేసుకుంటున్న భూములపై హక్కులు లేకపోవడంతో సమస్యను ఎదుర్కొంటున్నారని తెలిపారు. మఠాధిపతులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం భూముల రిజిస్ట్రేషన్‌కు తమ వైపుగా కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లింగంగుంట్ల గ్రామ రైతులు, పుష్పగిరి పీఠం తరపున పెద్దలు పాల్గొన్నారు.



గుంటూరు వార్త

# మహంకాళి ఆలయ తిరునాళ్ళ బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

**నరసరావుపేట టౌన్, మార్చి2 ప్రభాతవార్త :** మండలంలోని ఇక్కుర్రు గ్రామంలో వేంచేసి ఉన్న మహాంకాళి అమ్మవారి ఆలయ తిరునాళ్ళమహోత్సవ బ్రోచర్‌ను శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ 50వ వార్షికోత్సవం పురస్కరించుకుని నిర్వహించే తిరునాళ్ళ కార్యక్రమాన్ని భక్తులు, ఆలయ కమిటి, అధికారులు విజయవంతం చేయాలని సూచించారు. ఇటీవల జరిగిన కోటప్పకొండ తిరునాళ్ళను విజయవంతం చేసిన భక్తులు, అధికారులకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. మహంకాళి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఈ నెల 16,17,18తేదిలలో వైభవంగా జరుగుతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడఅరవింద బాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఇవో నలబోతు మాధవి దేవి, ఆలయ అర్చకులు, కమిటి సభ్యులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌కు సిద్ధం : జిల్లా కలెక్టరు నాగలక్ష్మీ

**గుంటూరు,మార్చి 2,ప్రభాతవార్త :** ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలి ఎన్నికల ఓట్ల కౌంటింగ్ కు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నేడు (సోమవారం) ఉదయం 8నుంచి ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని రిటర్నింగ్ అధికారి,జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు.ఆదివారం స్థానిక ఆంధ్రక్రైస్తవ కళాశాల్లో కౌంటింగ్ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమం అనంతరం కలెక్టర్,సంయుక్త కలెక్టర్ భార్గవ తేజ్‌తో కలసి మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ ఫిబ్రవరి 27వ తేదిన ముగిసిన అనంతరం అన్ని జిల్లాల బ్యాలెట్‌బాక్సులు కౌంటింగ్ జరిగే ఏసి కళాశాల్లోని స్ట్రాంగ్ రూమ్‌లోకి తరలించి భద్రపరచడం జరిగిందన్నారు.పోలింగ్ దాదాపు 69.5శాతం జరిగినందున దాదాపు 2.41లక్షల ఓట్లు లెక్కించాల్సి ఉందన్నారు.బ్యాలెట్ పేపర్,మొదటి ప్రాధాన్యత ఓట్లు విధానంతో లెక్కింపు జరుగుతున్న నేపధ్యంలో ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రక్రియ ప్రకారం కౌంటింగ్ సుమారు రెండు,మూడు రోజులు జరిగే అవకాశం ఉందన్నారు.ఓట్లు లెక్కింపు కోసం మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహించేలా 750మంది కి వివిధ డ్యూటీలు కేటాయించడం జరిగిందన్నారు.అభ్యర్ధులు సైతం ఏజెంట్లను మూడు షిఫ్టుల్లో నియమించుకునేలా అవకాశం కల్పించామన్నారు.కౌంటింగ్ ప్రదేశం మొత్తం మూడంచెల పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని గుర్తింపు కార్డు లేకుండా ఎవర్ని కౌంటింగ్ ప్రాంతానికి అనుమతించడం జరగదన్నారు.అదేవిధంగా కౌంటింగ్ హాల్లోకి సెల్‌ఫోన్లు అనుమతించరని,పూర్తిస్థాయిలో తనిఖీ చేసిన తర్వాత మాత్రమే కౌంటింగ్ హాల్లోకి ఏజెంట్లను,కౌంటింగ్ సిబ్బందిని అనుమతించడం జరుగుతుందన్నారు.ఓట్లు లెక్కింపు సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియాకు తెలియజేసేలా ఏర్పాట్లు చేయడం జరిగిందని,వీటితో పాటు ఇతర అవసరమైన అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయడం జరిగిందన్నారు.



# భక్తి శ్రద్ధలతో రంజాన్ ఉపవాస దీక్షలు

**రెంటచింతల, మార్చి 2 ప్రభాతవార్త:** పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని ఉపవాస దీక్షలు మండలంలోని ముస్లిం సోదర సోదరీ మణులు ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. రంజాన్ ఉపవాసాలు ఉదయం 5.13 గంటలకు ప్రారంభమై సాయంత్రం 6.25 గంటలకు వరకు ఉంటారు. ఈ ఉపవాసాలను 30 రోజుల వరకు కొనసాగిస్తారు. రెంటచింతల మండలంలో ఏడు గ్రామాల్లో 11 మసీదులు ఉన్నాయి. వీటిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కొన్ని మసీదులకు కనులు మిరమిట్లు గొలిపేలా లైటింగ్‌లతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మసీదులలో రంజాన్ తరాబీ నమాజులు చదివించడానికి వేర్వేరు ప్రదేశాల నుంచి ఆఫీజు సాబులు వచ్చారు. తుమ్మకోట అలంగీరు సీదులో ముత్తి సాబ్ షేక్ ఖాసిం, హుస్సేనియా మసీదులో ఆఫీజు సాబ్ షేక్ గోరుబడే మహమ్మద్ ఆరీఫ్‌లు రంజాన్ తరబీ నమాజులు చదివిస్తున్నారు. పురుషులు మసీదులలో ప్రత్యేక నమాజులు చదువుతున్నారు. మహిళలు వీధిలో ఒకరి ఇంటిని ఎంచుకుని ఉపవాస దీక్ష నమాజులు చదువుకుంటున్నారు. రంజాన్ దీక్ష ప్రత్యేక నమాజులలో పెద్దలతోపాటు పిల్లలు కూడా పాల్గొని ఆనందంగా జరుపుకుంటున్నారు.



# వైభవంగా శేష వాహనంపై శ్రీవారి నగరోత్సవం

**గుంటూరు కల్చరల్,మార్చి 2,ప్రభాతవార్త :** స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టబంధన మహాసంప్రోక్షణ సమేత మహాకుంభాభిషేక మహోత్సవాల సందర్భంగా ఆదివారం శేష వాహనంపై శ్రీవారి నగరోత్సవం వైభవంగా జరిగింది.మూల విరాట్‌లకు విశేషాభిషేకాలు,అర్చనలు,అలంకరణ జరిగాయి, టిటిడి ఆగమశాస్త్ర పండితులు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు,అగ్నిహోత్ర శోభనాచల లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం,అగ్ని ప్రతిష్ట, కుంభారాధన, సుదర్శన హోమ కుండములో అగ్నిప్రతిష్ట ప్రధాన హోమం విశేష హోమాలు, వేదస్వస్తి తదితర పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన శేష వాహనంపై ఉభయ దేవి సమేతుడైన స్వామి ఉత్సవమూర్తులకు నగరోత్సవం ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు.మంగళ వాయిద్యాలు,నామసంకీర్తన బృందాలు,విద్యుద్దీప కాంతుల నడుమ నగరంలోని ప్రధాన వీధుల్లో ఊరేగింపు జరిగింది.ఈ సందర్భంగా జరిగిన సభకు ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్ మస్తానయ్య అధ్యక్షత వహించారు.భీమవరానికి చెందిన త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్‌స్వామి భక్తులను ఉద్దేశించి కుంభాభిషేక విశేషాలను వివరిస్తు మంత్రాధినులైన దేవతలను ఆవహించి,విశేష కుంభపూజ నిరవ్రహిస్తారన్నారు.ప్రముఖ సాహితీవేత్త మల్లాది కైలాసనాథ్ బ్రహ్మోత్సవాలు, కుంభాభిషేక విశిష్టతను వివరించారు.సభలో అతిధులుగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి,వివిఐటి విద్యాసంస్థల ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.భారతీ ధార్మిక విజ్ఞానపరిషత్ బొల్లేపల్లి సత్యనారాయణ,ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమా మహేశ్వరరావులు అతిధులను సత్కరించారు. కార్యక్రమాలను కోశాధికారి లంకా సూర్య నారాయణ, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు,పుట్ట ప్రభాకర్‌రావు,సూర్యదేవర వెంకటేశ్వరరావు తదితరులు పర్యవేక్షించారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతగా బ్రహ్మశ్రీ నోరి నారాయణమూర్తి, మహాకుంభాభిషేకం, విశేషాలను చక్కగా వివరించారు.

# దేవరల పూజారి హత్యకేసులో 7గురు నిందితుల అరెస్టు

**జగ్గయ్యపేట, మార్చి 2, ప్రభాతవార్త :** దేవరల ఊరేగింపు వేడుకను తమకు అనుకూలంగా మలుచుకుని తమకు తరచుగా అడ్డుపడుతున్న పూజారిని హతమార్చాలని పధకం వేసిన నిందితులు పగడ్బందీగా అమలుచేసిన తమ వ్యూహంతో పూజారిని హతమార్చారు. అయితే చేసిన నేరం నుండి పోలీసుల కన్నుగప్పటంలో విఫలమై దొరికిపోయారు. ఆస్తులు, ఆభరణాలు, దోపిడీలకు పాల్పడేవారు హత్యలు చేసేందుకు వెనుకాడరనే విషయం అందరికి తెలిసిందే. అయితే తమ తోటి వాడే తమ తప్పులను ఎత్తిచూపుతూ ప్రతివిషయంలో అడ్డుతగులుతూ, పెద్దరికం వెలిగించుకుంటూ నలుగురితో తాను గొప్పవాడైనట్లు ప్రవర్తిస్తున్న వ్యక్తిని అడ్డుతొలగించుకోవాలనే నిర్ణయంతో హత్య చేయటం, అది కూడా వారందరి కులాచారంలోని దేవర ఊరేగింపులో కోడికత్తి ఉపయోగించి గొంతుకోసి చంపటం గమనించాల్సిన అంశం. ఎవరితో గొడవ పడినా తాను వచ్చి గద్దించి మధ్యవర్తిగా అందరిలో మంచిపేరు తెచ్చుకుంటూ తమను తప్పుడు మనుషులుగా పరిగణింపజేస్తున్నాడని పగబట్టారు. నిందితుల్లో 17 ఏండ్ల వయసుగల మైనర్ బాలుడు కూడా ఉండటం నేటి సమాజపోకడలను స్పష్టం చేస్తోంది. వివరాల్లోకి వెళితే... ఫిబ్రవరి 27వ తేదీ రాత్రి పట్టణంలోని చెరువుబజార్‌లో వీరుల పూజారి బత్తుల శ్రీనును గొంతు కోసి దారుణంగా చంపారు. ఇటీవలి కాలంలో వస్తున్న సినిమాల్లో జరుగుతున్న హత్యల నేపథ్యం నిజజీవితంలో యువతపై ప్రభావం చూపుతోంది. శివరాత్రి వెళ్ళిపోయిన తర్వాత రోజుల్లో బడుగులు తమ కుటుంబాలకు సంబంధించిన మృతులను వీరులుగా భావిస్తూ వేడుకలు జరుపుకోవటం శతాబ్దాల కాలంగా కొనసాగుతున్న సంప్రదాయం. అదే విధంగా ఈదఫా కూడా ఇలాగే వేడుకలు ఎల్లమ్మతల్లి జాతర కూడా జరుగుతుండగా డీజే సౌండ్‌కు సంబంధించిన విషయంలో మొదలైన చిన్న గొడవ చివరికి కత్తులతో దాడికి దారి తీసింది. దీని వెనుక పాత కక్షలు ఉన్నాయనే విషయం పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది. బత్తుల శ్రీను మెడపై కత్తివేటు పడటంతో తీవ్ర రక్తస్రావమై వెంటనే మృతి చెందాడు. హతుని సోదరుడు బత్తుల వెంకటేశ్వర్లు, ఓర్సు నాగబాబులకు కూడా ఈసంఘటనలో అడ్డుపడిన సందర్భంలో కత్తివేటు గాయాల పాలై చికిత్స పొందుతున్నారు.

**పోలీసుల వివరణ :** ఆదివారం పద్మావతినగర్ వద్ద నిందితులను సిఐ పి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పట్టణ ఎస్ఐ రాజు, చిల్లకల్లు ఎస్ఐ సూర్యశ్రీనివాస్, పోలీసు సిబ్బంది తమకు అందిన సమాచారంతో నిందితులను అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో హత్య జరిగిన వైనం గురించి పోలీసులు పూర్తి సమాచారం రాబట్టారు. సిఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక చెరువుబజార్‌కు చెందిన నిందితులు బత్తుల కిషోర్ (25), బత్తుల వెంకట శివకుమార్ (19), బండి సాయి అంకమరావు శ్రీసాయి (19), బండి రవికుమార్ (23), వేముల జ్వాల నరసింహారావు (23), రూపాన వినయ్ (19), అదే ప్రాంతానికి చెందిన 17 ఏండ్ల ఒక మైనర్ బాలుడు ఈనేరంచేశారు. విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్‌వి రాజశేఖర్‌బాబు ఈకేసును వేగవంతంగా దర్యాప్తుచేసి నిందితులను అరెస్ట్ చెయ్యాలని ఆదేశించారని, రూరల్ డిసిపి కెఎం మహేశ్వరరాజు పర్యవేక్షణలో నందిగామ ఏసిపి తిలక్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేసినట్లు సిఐ వెంకటేశ్వర్లు వివరించారు.



# గంజాయి మత్తులో యువత వీరంగం

## -ఒకరిపై కత్తితో దాడి..తీవ్ర గాయాలతో వైద్యశాలకు తరలింపు

**సత్తెనపల్లి, మార్చి 2 ప్రభాతవార్త :** పట్టణంలోని నాగార్జుననగర్ 6వ వార్డుకు చెందిన తమ్మిశెట్టి ఆంజనేయులు (అంజయ్య) మార్చి 1వ తేదీన సాయంత్రం సమయంలో కిరాణా సరుకుల కోసం దగ్గరలోని షాపుకు వెళ్ళాడు. అయితే ఈయన తిరిగి వస్తున్న క్రమంలో క్రిష్టియన్‌పేటకు చెందిన యువకులు మద్యం, గంజాయి సేవించి అంజయ్య వద్ద ఉన్న డబ్బులు ఇవ్వమని అడుగగా అతను తిరస్కరించడంతో ఎర్రసాని గోపి, మరో ఇద్దరు యువకులు కత్తులతో అంజయ్యపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో అంజయ్య గాయ పడ్డాడు. బాధితుడిని స్థానికులు హుటాహుటిన సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు ఆయనకు వైద్యచికిత్స అందించారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# ఆకట్టుకున్న శ్రీరామాంజనేయ యుద్ధం,సత్యహరిశ్చంద్ర పౌరాణిక పద్యనాటక ప్రదర్శనలు

**గుంటూరు కల్చరల్,మార్చి 2,ప్రభాతవార్త :** స్థానిక కృష్ణతులసీనగర్ 1వలైనులోని అభయాంజనేయ కళా ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి సమితి,విజయవాడ వారి సౌజన్యంతో మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం శ్రీకరుణామయి బాలయేసు నాట్యమండలి,గుంటూరు వారిచే రామాంజనేయ యుద్ధంలోని యుద్ధఘట్టం పద్యనాటక ప్రదర్శన జరిగింది.శ్రీరాముడిగా జి.శ్రీనివాసరావు,ఆంజనేయునిగా యు.బ్రహ్మం నటించారు.అనంతరం సత్యహరిశ్చంద్ర పూర్తినాటకం జరిగింది.విశ్వామిత్రుడిగా తక్కెళ్ళపాడు షేక్ మీరావలి,హరిశ్చంద్రులుగా కె.వి.రమణ,వివేకానంద స్వామి,గుర్రాల వెంకటేశ్వరరావు,తుళ్ళూరు వెంకయ్యస్వామి,నక్షత్రకులుగా పరదేశీ,జి.వేంకటేశ్వర్లు,చంద్రమతిగా ఎం.లక్ష్మీశ్రీ,కాలకౌశికుడిగా నామాల శ్రీనివాసరావు,వీరబాహుడిగా పిపి దాసు కే.వేంకటేశ్వరరావు,కేశవగా ఆర్.రత్తయ్య,మాతంగిగా జి.పద్మ,లోహితగా సాయి,పౌరాణిక పద్యాలతో నాటక ప్రదర్శన చేసి నాటకాభిమానులను,ఆహుతులను అలరించారు.వీరికి హార్మోనియం ఎన్.సిద్దయ్య,డోలక్ ఎం.రామాంజనేయులు,క్లారినెట్ షేక్ నభి,వాయిద్య సహకారాన్ని అందించారు.కార్యక్రమంలో అతిధులుగా ప్రత్తిపాడు శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు,ఆదర్శ మహిళా మండలి అధ్యక్షురాలు కోవూరు లక్ష్మీ,42వ డివిజన్ టిడిపి అధ్యక్షులు బూరి సురేష్ కళాకారులను ప్రశంసించి సత్కరించారు.



# దొంగలొస్తున్నారు..తస్మాత్ జాగ్రత్త!

## -బెంబేలెత్తుతున్న మండల ప్రజలు..
## -ఊర్లు వెళ్ళాలంటే భయం..భయం..

**కొల్లిపర,మార్చి 2 ప్రభాతవార్త:** అక్కడ దొంగలు పడ్డారు...ఇక్కడ దొంగలు పడ్డారు...ఆ ఊర్లో దొంగతనం జరిగింది..ఈ ఊర్లో నగదు దోచుకెళ్ళారు..ఇది కొల్లిపర మండలంలో పలు గ్రామాల్లో నిత్యం వినిస్తున్న మాటలు..గ్రామస్తుల తెలిపిన వివరాల ప్రకారం గత 15 రోజులుగా కొల్లిపర,మున్నంగి,వల్లభాపురం గ్రామాల్లో ఏదో ఒక ఇంట్లో దొంగలు పడి నగదు ..విలువ గల వస్తువులు దోచుకెళుతున్నారు.దొంగలు వరుస దొంగతనాలు చేస్తుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.దొంగతనాలు జరిగిన కొందరు పోలీసులను ఆశ్రయిస్తుంటే మరి కొందరు మరోకరికి చెప్పుకోలేక ఇంట్లో భాదపడుతూ కుమిలిపోతున్నారు.ముఖ్యంగా ఊరు వెళ్ళి ఇళ్ళకు తాళాలు పెట్టి వెళ్ళిన వారి గృహాలను గుర్తించి రాత్రికి రాత్రి వెళ్ళి దోచుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.బలమైన ఇనుప రాడ్లతో తాళాలను పగుల కొట్టి బీరువాలను రాడ్‌లతో వంచి అందినకాడికి దోచుకుంటున్నారు.చీకటి పడితే చాలు దొంగల భయంతో గ్రామస్తులు కంటి మీద కునుకులేకుండా పోతుంది..ఏ క్షణంలో ఏమి జరుగుతుందోనని భయపడుతున్నారు.ఆదివారం మండల కేంద్రం కొల్లిపరలో దొంగతనం జరిగిందని పిర్యాదు రావటంతో అక్కడకు క్లూస్‌టీం దిగి ఒక ఇంట్లో వివరాలు సేకరించారు.అంతేకాకుండా కొల్లిపర గ్రామస్తులు పోలీస్‌స్టేషనుకు వచ్చి కొద్ది రోజులుగా గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తున్నారని గంజాయి..మద్యం మత్తులో వచ్చి ఇష్టాను సారంగా సంచరిస్తూ దొంగతనాలకు పాల్పడుతున్నారని..ఊరు వెళ్ళా లంటే ఏమి జరుగుతుందోనని భయపడి పోతున్నామని తగిన చర్యలు తీసుకోవాలని ఎస్ఐ కోటేశ్వరరావుకు పిర్యాదు చేసారు.ఈ సందర్భంగా ఎస్ఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ రాత్రి వేళల్లో పెట్రోలింగ్ వ్యవస్థను పటిష్టం చేస్తున్నామని.. దొంగతనాలు జరగకుండా తగిన చర్యలు తీసు కుంటామన్నారు.ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు.క్లూస్ టీం కూడా తీసుకురావటం జరిగిందని..దొంగలను త్వరలో పట్టుకుంటామని చెబుతూ గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.



పోలీస్‌స్టేషనులో పిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

# తెలుగుదేశంపార్టీ అంటేనే అభివృద్ధి, సంక్షేమం

**నరసరావుపేట, మార్చి 2 ప్రభాతవార్త :** తెలుగుదేశంపార్టీ అంటేనే అభివృద్ధి, సంక్షేమం అని ఆ పార్టీ నాయకులు ఆదివారం అన్నారు. స్థానిక కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో నాయకులు పులిమి రామిరెడ్డి, వాసిరెడ్డి రవి, కడియం కోటి సుబ్బారావు, గూడూరి శేఖర్, అంకమ్మ చౌదరి తదితరులు పాల్గొని మాట్లాడారు. కోటప్పకొండ అభివృద్ధిపై, రాష్ట్ర బడ్జెట్‌పై ప్రతిపక్ష నాయకులు చేస్తున్న విమర్శలను వారు ఖండించారు. రాష్ట్ర బడ్జెట్ సమాజంలోని అన్ని వర్గాల వారికి సంక్షేమాన్ని, అభివృద్ధిని అందించే విధంగా ఉందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ పాలనలో రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. కోటప్పకొండ తిరునాళ్ళ పూర్తి స్థాయిలో విజయవంతమైందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు నాయకత్వంలో జిల్లా కలెక్టర్, ఎస్పీలు తమ అధికార యంత్రాంగంతో బ్రహ్మాండంగా పని చేశారని, లక్షలాది మంది భక్తులకు మౌలిక వసతులు కల్పించారన్నారు. అదే విధంగా గత ప్రభుత్వం కోటప్పకొండలో ఎటువంటి అభివృద్ధి పనులు చేయలేదన్నారు. తెలుగుదేశంపార్టీ మాత్రమే కోటప్పకొండను అభివృద్ధి చేసిందన్నారు. కెనాల్స్ వద్ద శివ కుటుంబాన్ని అద్భుతంగా తీర్చిదిద్దామని తెలియజేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కారణంతో కొంత ఏర్పాట్లకు ఇబ్బందులు ఎదురైనప్పటికీ వాటిని అధిగమించి ఏర్పాట్లు చేశామన్నారు. గోనెపూడి ప్రభ వద్ద జరిగిన ఘర్షణ చిన్నదన్నారు. అదే విధంగా అర్వపల్లి గ్రామంలోనూ జరిగినటువంటి ఘర్షణను పెద్దదిగా చూసేందుకు చూడటం శోచనీయమన్నారు. కోటప్పకొండ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు నాయకత్వంలో రోప్ వేను నిర్మిస్తామన్నారు. అదే విధంగా కొండపైకి రెండవ ఘాట్ రోడ్డును తెలుగుదేశంపార్టీ హయాంలోనే ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. ఇప్పటికైనా ప్రతిపక్ష నాయకులు చేసే విమర్శలు సముచితంగా ఉండాలన్నారు. గత ఎన్నికల్లో వైకాపాని ప్రజలు ఓడించారని, ఆ పార్టీకి అభివృద్ధి చేయడం తెలియదని టిడిపి నాయకులు విమర్శించారు.

# మరో పనికందును స్వాధీనం చేసుకున్న ఏసిపి లతాకుమారి

## -ఉమెన్ అండ్ చైల్డ్ డిపార్ట్‌మెంట్ వారికి అప్పగింత

**విజయవాడ క్రైం,మార్చి 2,ప్రభాతవార్త:** సిపి రాజశేఖరబాబు ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఏడిసిపి శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఈ నెల 1న అక్రమంగా చిన్న పిల్లలను విక్రయించిన ఐదుగురు మహిళలను అదుపులోకి తీసుకుని వారి నుండి ముగ్గురు పిల్లలను స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆదివారం కూడ ఏసిపి లతాకుమారి అధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్,మహిళా పోలీస్‌స్టేషన్ అధికారులు సిబ్బందితో కలిసి నిందితులు విక్రయించిన మరో బేబీని రాజమండ్రి,సీతానగరం సీమపంలో రెస్క్యూ చేసి ఉమెన్ అండ్ చైల్డ్ డిపార్ట్‌మెంట్ వారికి అప్పగించారు.



# రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారంటీ లేని బడ్జెట్ : ఎంఐఎం

**నరసరావుపేట, మార్చి 2 ప్రభాతవార్త :** రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారంటీ లేని బడ్జెట్‌ను కూటమి ప్రభుత్వం ప్రకటించిందని పల్నాడు జిల్లా ఎంఐఎం పార్టీ సెక్రటరీ మౌలాలి అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో జాబ్ క్యాలెండర్ ఎక్కడా చూపలేదన్నారు. నిరుద్యోగ భృతి నిధులను కేటాయించలేదని తెలిపారు. ఉచితంగా రైతులకు అందించే పంటల భీమాకు సున్నా వడ్డీ రుణాల గురించి ఊసే లేదన్నారు. అదే విధంగా ఉచిత బస్సు ప్రయాణం పేరు కూడా చెప్పలేదన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి సరిపోను నిధులు ఇవ్వలేదన్నారు. ఆడబిడ్డ నిధికి పంగనామం పెట్టే కార్యక్రమాన్ని బడ్జెట్‌లో చేశారన్నారు.

# 12న అరుణాచలంకు సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు: డిఎం

**ఎ కొండూరు, మార్చి 2, ప్రభాతవార్త :** తిరువూరు ఆర్టీసి డిపో నుండి ఈ నెల 12న బుధవారం సాయంత్రం 5 గంటలకు అరుణాచలంకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును ప్రవేశపెట్టినట్లు డిఎం ఎ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ నెల 12న బయలుదేరి 13న గురువారం కాణిపాకం చేరుకుని దర్శనం అనంతరం శ్రీపురం (గోల్డెన్ టెంపుల్) దర్శనం చేసుకుని గురువారం రాత్రి పౌర్ణమి సమయానికి అరుణాచలం క్షేత్రానికి చేరుకుని గిరిప్రదక్షిణ దర్శనం పూర్తి అనంతరం ఈ నెల 14న శుక్రవారం కంచి తిరుత్తని దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో శ్రీకాళహస్తి దర్శనానంతరం 15 శనివారం రాత్రికి తిరువూరుకు చేరుకుంటుందని డిఎం సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ ప్రత్యేక బస్సు సర్వీస్ నెంబర్ 65184 భక్త ప్రయాణీకులు తమ సీట్లను ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేయించుకోవచ్చునని లేదా ఎపిఎస్సార్టీసి రిజర్వేషన్ కౌంటర్ నుండి టికెట్లు పొందవచ్చునని డిఎం తెలిపారు. 2+2 పుష్‌బ్యాక్ సీట్లు కలిగి ఉన్న బస్సు అప్ అండ్ డౌన్ టికెట్ ధర తిరువూరు నుండి రూ.2800/- విజయవాడ నుండి రూ.2500/- అని ఈ సదవకాశాన్ని భక్త ప్రయాణీకులు వినియోగించుకుని సంస్థ అభివృద్ధికి తోడ్పడాల్సిందిగా డిఎం కోరారు. వివరాల కొరకు 7382487969 మరియు 9885661835 చరవాణి నెంబర్లకు సంప్రదించాలని వసతి భోజన ఖర్చులు ఎవరికి వారే భరించుకోవాలని డిఎం సుబ్రహ్మణ్యం కోరారు.

ప్రభాత వార్త

స్టాఫ్ రిపోర్టర్లు, న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను

విస్తృతమైన వార్తా సేకరణ యంత్రాంగం ఉన్న వార్త న్యూస్ నెట్‌వర్క్‌ను మరింత పటిష్టవంతంగా చేయాలనుకుంటోంది. పాఠకులకు మరింత తాజా వార్తలను అందించేందుకు పల్నాడు, గుంటూరు జిల్లాల్లో విలేకరుల యంత్రాంగాన్ని విస్తృతపరచాలని నిర్ణయించింది. ఆసక్తి గలవారికి స్టాఫ్‌రిపోర్టర్లు, న్యూస్ కంట్రిబ్యూటర్లయ్యే సదవకాశం కల్పిస్తోంది.

అభ్యర్థులకు కావలసిన అర్హతలు

- 35 ఏళ్ళ లోపు వయస్సు
- స్థానికంగా నివాసం
- డిగ్రీ
- ప్రజల జీవన స్థితిగతులపై అవగాహన

స్టాఫ్ రిపోర్టర్లు, న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలసిన కేంద్రాలు

బాపట్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్,పల్నాడు జిల్లా స్టాఫ్ రిపోర్టర్, రేపల్లె ఆర్‌సి ఇన్‌చార్జి,ప్రత్తిపాడు ఆర్‌సి ఇన్‌చార్జి, అమరావతిక్రైం,క్రోసూరు,అచ్చంపేట,పెదనందిపాడు, కాకుమాను,మేడికొండూరు,ఫిరంగిపురం,తాడికొండ.

గుంటూరు యూనిట్ కార్యాలయంలో 7-3-2025న జరిగే ఇంటర్వ్యూలకు ఆసక్తిగల అభ్యర్థులు తమ బయోడేటాతో సంప్రదించగలరు.

'వార్త' యూనిట్ కార్యాలయము

NH-5, చిలకలూరిపేట రోడ్, అంకిరెడ్డిపాలెం, గుంటూరు.

ఫోన్ :8978645935

## రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో రాష్ట్రానికి ఒరిగేది ఏమి లేదు : కోన రఘుపతి

**బాపట్ల, మార్చి2, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తో రాష్ట్రానికి ఒరిగేది ఏమి లేదని వై ఎస్ ఆర్ పార్టీ బాపట్ల నియోజకవర్గ ఇంచార్జీ మాజీ శాసన సభ్యులు కోన రఘుపతి అన్నారు. ఆదివారం స్థానిక వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలను




చంద్రబాబు నాయుడు అంకెల గారిడితో మరళా మోసం చేశారన్నారు. రాష్ట్ర బడ్జెట్‌ను రూ. 3.22 లక్షల కోట్లతో ప్రవేశపెట్టటం చూస్తుంటే వాటిని కేటాయింపులకే పరిమితం చేసే విధంగా ఉందన్నారు. రూ. 72వేల కోట్ల అప్పు ఉంటేనే గగ్గోలు పెట్టిన చంద్రబాబు ప్రస్తుతం లక్షల కోట్లు ఏవిధంగా అప్పులు చేశారో ప్రజలు గమనిస్తున్నారన్నారు. అమరావతి నిర్మాణానికే 40వేల కోట్లు అవసరం అని చెప్పన చంద్రబాబు నాయుడు రూ. 6వేల కోట్లు కేటాయించడం ఆయనకు ఏమేరకు చిత్తశుద్ధి ఉందో అర్ధమౌతుందన్నారు. గత వైసిపి పాలనలో 66లక్షల మందికి ఫించన్లు ఇస్తే ప్రస్తుతం చంద్రబాబు నాయుడు కేవలం రూ. 8వేల కోట్లు కేటాయించడం గమనిస్తే ఎంతమంది ఫించన్లు తోలగించడానికి కుట్రపన్నుతున్నారో అర్ధమౌతుందన్నారు. బిసిలకు 50సంవత్సరాలకే ఫించన్ ఇస్తామని చెప్పడం విడ్డురంగా ఉందన్నారు. వైన్ షాపులను ఎక్కడపడితే అక్కడ అనుమతులు ఇవ్వడంతో పాటు ఒక్కొక్క షాపు20కుపైగా బెల్టు షాపులు ఇచ్చి ఎక్సైజ్ శాఖ చోద్యం చూస్తున్నారన్నారు. తల్లికి వందనం పథకం ఇంతవరకు లేదన్నారు. మహిళలకు 1500 రూపాయలు పథకం అమలు కాలేదు, వంటగ్యాస్ సిలిండర్ ఇప్పటివరకు ఒక సిలిండర్ మాత్రమే ఇచ్చారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను తూలనాడి మాట్లాడటం హేయమైన చర్యగా అభివర్ణించారు. నిరుద్యోగులకు భృతి కల్పించలేదనీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు కాలేదన్నారు. అదేవిధంగా సూపర్ సిక్స్ అమలుకు నోచుకోవడం లేదనీ పేర్కొన్నారు. బెల్టుషాపులు విపరీతంగా పెరిగిపోయాయి, మద్యం గ్రామగ్రామాన పేదవారికి డోర్ డెలివరీ చేసి తెలుగుదేశం పార్టీ నాయకులు దోచుకుంటున్నారనీ ఆరోపించారు. సచివాలయాలను నిర్వీర్యం చేసే పనిలో ప్రభుత్వం ఉందన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు త్వరితగతిన అందుబాటులో ఉండేందుకు సచివాలయాలు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టినట్లు తెలిపారు. పథకాలన్నీ నిర్వీర్యం చేసి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండలపార్టి అధ్యక్షులు మరుప్రోలు కొండలరెడ్డి, చెంచయ్య, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, పార్టీ నాయకులు జోగి రాజా, కృష్ణగుప్తా, కటికల యోహోషువ, పిన్నిబోయిన ప్రసాద్, సాయిల మురళి, నర్రా వెంకటరావు ,ఊరిబిండి గోపి, తన్నీరు అంకమ్మ, బి గోపి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యోగా ద్వారా మానసిక వత్తిడిని జయించవచ్చు

**బాపట్ల, మార్చి02, ప్రభాతవార్త:** యోగా చేయడం వలన మానసిక వత్తిడిని జయించవచ్చునని జిల్లా పోలీస్ అధికారులు తెలియజేశారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి సూచనలతో పోలీస్ స్టేషన్ పరిదిలో జిల్లా పోలీస్ అధికారులు ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి 1వ తేదీ నుండి జిల్లాలో "మహిళా సాధికారత వారోత్సవాలు" ప్రారంభించామని వీటిని మార్చి 8వ తేది వరకు నిర్వహించనున్నామన్నారు. మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సాధించిన ప్రగతిని గురించి, మహిళల హక్కులు, సమానత్వం, భద్రత, రక్షణకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తీసుకుంటున్న చర్యలు గురించి అవగాహన కల్పించేందుకు, మహిళల శక్తిని, మానసిక స్థైర్యాన్ని, స్వీయ రక్షణ సామర్థ్యాన్ని పెంపొందించడానికి వివిధ కార్యక్రమాలు నిర్వహించామన్నారు.



యోగా, మెడిటేషన్ అనేవి భారతీయ సంస్కృతిలో ఒక భాగమని, ఇవి మన శరీరం, మనస్సులను సమతుల్యం చేస్తాయని, వీటిని అభ్యసించడం ద్వారా మానసిక వత్తిడిని జయించ గలుగుతామని, ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని, మనస్సు ప్రశాంతంగా ఉంటుందని, యోగా అభ్యాసం ద్వారా మనం పొందే ఉపయోగాలు అనేకమని, ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో యోగాసనాలు గురించి తెలుసుకొని వాటిని ఆచరించాలని పోలీసు అధికారులు సూచించారు.

## చిలకలూరిపేట నియోజక వర్గంలో భాజపా పటిష్టతకు ప్రణాళికలు

**చిలకలూరిపేట, మార్చి2, ప్రభాతవార్త:** చిలకలూరిపేట నియోజక వర్గంలో భారతీయ జనతా పార్టీ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలనిభారతీయ జనతా పార్టీ ఓబిసి మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్నం శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన కార్యాలయంలో నాయకుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బూత్ కమిటీలను వేగవంతంగా పూర్తి చేయాలని 11మందితో బూత్ కమిటీని ఏర్పాటుచేయాలని ఆయన తెలియచేశారు. రానున్న కాలంలో తెలుగుదేశం జనసేన పార్టీలతో కలిసి పనిచేయాలని సూచించారు. గ్రామగ్రామాన కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అధివృద్ధి పథకాలను ప్రజలకు తెలియచేయాలని కోరారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు అడుసుమల్లి వెంకటేశ్వరరావు, దడబడపుల్లయ్య, కుప్పం కళ్యాణ దుర్గారావు, అన్నపురెడ్డి లక్ష్మణ్, పటాన్ నబీఖాన్, సింగిరేసు పోలయ్య, షేక్ సుబానీ, గుమ్మా బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## 14న పిఠాపురంలో జరిగే జనసేన ఆవిర్భావ సభను జయప్రదం చేయాలి : పెంటేల బాలాజి

**చిలకలూరిపేట, మార్చి2, ప్రభాతవార్త:** పిఠాపురంలో మార్చి14వ తేదీన జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్రా కో కన్వీనర్ పెంటేల బాలాజి తెలిపారు. ఆదివారం ఆయన నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాలాజి మాట్లాడుతూ పిఠాపురంలో జరిగే ఆవిర్భావ సభ ప్రతిఒక్క జనసైనికులకు పండగ రోజు అని, ఈ సభను విజయవంతం చేయటానికి ప్రతి జన సైనికుడు, వీరమహిళలు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని బాలాజి పిలుపు ఇచ్చారు. జనసేన పార్టీ ఆవిర్భావమే ఒక ప్రభంజనం అని, ప్రయాణం ఒక ప్రేరణ అని ఆయన అభివర్ణించారు. ప్రత్యర్థుల విమర్శలను సైతం లెక్కచేయక నిలబడి వంద శాతం విజయబావుట ఎగరవేసిన పార్టీ జనసేనఅని పేర్కొన్నారు. ఈ సభ విజయవంతం కావటానికి 254మందితో వేసిన 14కమిటీలు ప్రజలలోకి వెళ్తున్నాయని తెలిపారు.



## రోటరీ క్లబ్ చిలకలూరిపేటను సందర్శించిన చెన్నై రోటరీ మహిళా సభ్యులు

**చిలకలూరిపేట, మార్చి2, ప్రభాతవార్త:** మొక్కలు పెంచుదాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం, ముందుతరాలను గ్లోబల్‌వార్మింగ్ నుంచి కాపాడుదాం అనేసంకల్పంతో చెన్నై రోటరీ మహిళాసభ్యులు ముగ్గురు ఆదివారం చిలకలూరిపేట రోటరీ క్లబ్‌ను సందర్శించారు. వివిధ ప్రాంతాలలోని క్లబ్‌లను సందర్శిస్తూ నేపాల్ వరకు వెళ్ళి తిరుగు ప్రయాణంలో చిలకలూరిపేటకు వచ్చారు. రోటరీ క్లబ్ ఆవరణలో మంచినీటి ప్లాంటు ఉచిత ఆరోగ్యకేంద్రం, మొక్కలను పరిశీలించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఆళ్ళవేమనరెడ్డి, కాపు వెంకలరావు, తోటకూర వెంకటనారాయణ, కొల్లా శివప్రసాద్‌కరణం వెంకటశివ, ధూళిపాళ వెంకటరావు, వడ్లమూడి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు

**కొల్లూరు, మార్చి 2 (ప్రభాతవార్త) :** మహిళలకు అత్యవసర సహాయం కోసం పోలీసు ఉమెన్స్ హెల్ప్ డెస్క్‌లకు సమాచారం అందించాలని కొల్లూరు ఎస్ఐజి ఏడుకొండలు తెలియజేశారు. జాతీయ మహిళా దినోత్సవంను పురస్కరించుకుని కొల్లూరు బస్టాండ్ సెంటర్లో ప్రభుత్వ వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న వైద్య బృందంతో కిశోర బాలికలకు మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ పాఠశాల కళాశాల విద్యార్థుల పట్ల అనుచిత ప్రవర్తన కలిగించే విధంగా ప్రవర్తిస్తే తక్షణం పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పాఠశాలల్లో ఏమైనా సమస్యలు వస్తే నిర్భయంగా ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. పోలీస్‌శాఖ విధి విధానాలను శాంతి భద్రతల పరిరక్షణ మహిళా చట్టాల అంశాలను మహిళలకు వివరించారు. మహిళా చట్టాలు ఫోక్స్ యాక్ట్, ర్యాగింగ్, యువ్‌టీజింగ్, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, సామాజిక మాధ్యమాలు సైబర్ క్రైమ్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాలికలు తప్పని సరిగా స్వయ రక్షణ కలిగి ఉండాలని ఎదుటి వారి నుంచి తమను తాము రక్షించుకోవడం నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యశాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది, కిశోర బాలికలు పాల్గొన్నారు.




## బగళాముఖి అమ్మవారిని దర్శించుకున్న కర్ణాటక రాష్ట్ర రిటైర్డ్ జిల్లా జడ్జి

**పిట్టలవానిపాలెం, మార్చి02, ప్రభాతవార్త:** పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలో గల ప్రసిద్ధిగాంచిన శ్రీ బగళాముఖి అమ్మవారి ఆలయానికి కర్ణాటక రాష్ట్ర రిటైర్డ్ సిటీ ప్రిన్సిపల్ సీనియర్ జడ్జి ఏ విశ్వనాథ్ కుటుంబ సమేతంగా అమ్మవారి ఆలయానికి విచ్చేశారు. తొలుతగా ప్రోటోకాల్ ప్రకారము బాపట్ల కోర్టు అధికారులు, రెవెన్యూ అధికారులు, పోలీసు, పంచాయతీ అధికారులు స్వాగతం పలికారు. దేవస్థానం సాంప్రదాయం ప్రకారం ఆలయ పూజారులు వారిని ఆలయప్రదక్షిణం చేయించి, అఖండ జ్యోతి దీపారాధన జరిపి, అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహింపజేసామని, దేవస్థానం తరపున అమ్మవారి చిత్రపటం ఆలయ చరిత్ర శేష వస్త్రములు, వేద ఆశీర్వచనం జరిపించి అందజేయడమైనదని ఆలయ కార్య నిర్వహణాధికారి జి నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలియపరిచారు.



## ఘనంగా శ్రీమావుళ్ళమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

**కొల్లూరు, మార్చి 2 (ప్రభాతవార్త) :** కొల్లూరు మండలం చినపులివర్రు గ్రామ పరిధిలోని గురివిందపల్లి ఆగ్రహారంలో ఉన్న శ్రీ మావూళ్ళమ్మా అమ్మవారు విగ్రహం ప్రతిష్ట మహోత్సవం అత్యంత వైభవంగా ఆదివారం జరిగింది. విగ్రహ ప్రతిష్టకు చుట్టుపక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మావుళ్ళమ్మ అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు చాట్రగడ్డ వీరరాఘవులు తెలిపారు. అనంతరం అన్న సమారాధన జరిగింది. ఈ కార్యక్రమాన్ని యలవర్తి శ్రీనివాస్, లాం సాంబశివరావు, ఎన్.ఎస్.ఎస్.సుబ్రహ్మణ్యం, చాట్రగడ్డ శివరామకృష్ణ, ఉప్పాల సురేంద్ర, గుర్రం రామకృష్ణలు పర్యవేక్షించారు.



## ఆడపిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దాలి

కొల్లూరు, మార్చి 2 (ప్రభాతవార్త) : ఆడ పిల్లల భవిష్యత్‌ను తల్లిదండ్రులు ఉజ్వలంగా మతీర్చి దిద్దాలని దోనేపూడి సూపర్‌వైజర్ ఫజరున్నీసా అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఆడపిల్లల జననాల వేడుకతో పాటు ఆడబిడ్డల పేరుతో మొక్కలు నాటించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ తల్లులందరూ ఆడ పిల్ల పుట్టిన వెంటనే ఒక మొక్కను నాటి సంరక్షించాలన్నారు. ఆ మొక్క పెరిగనివ్వడంతో పాటు మంచి ఫలాలు ఇస్తాయని అదే విధంగా ఆడ పిల్లను కూడా మంచిగా చదివించి ఉజ్వలంగా తీర్చి దిద్దుతే కుటుంబంతో పాటు సమాజం బాగు పడుతుందని అన్నారు. ఆడ పిల్లల పట్ల తల్లిదండ్రులు వివక్షత చూపరాదన్నారు. మహిళలు చదువుకుంటేనే దేశం అభివృద్ది చెందుతుందని అన్నారు. కొల్లూరు అనంతవరం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలలో సూపర్‌వైజర్ విజయలక్ష్మీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను అంగన్‌వాడీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కార్యకర్తలు, తల్లులు, కిశోర బాలికలు ఉన్నారు.



## శ్రీ క్షీర భావన్నారాయణ స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

**బాపట్ల, మార్చి2, ప్రభాతవార్త:** శ్రీ క్షీర భావన్నారాయణ స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని బాపట్ల పార్లమెంట్ సభ్యులు లోక్ సభ ప్యానల్ స్పీకర్ తెన్నేటి కృష్ణ ప్రసాద్ అన్నారు. ఎంపి టి.కృష్ణప్రసాద్ జన్మదిన వేడుకలను బాపట్ల పార్లమెంట్ పరిదిలోని బాపట్ల, చీరాల నియోజకవర్గాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత బాపట్ల లోని శ్రీక్షీర భావన్నారాయణ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనకు బాపట్ల పార్లమెంట్ సీటు ఖరారు కాగానే మొదటి సారిగా బాపట్ల వచ్చినప్పుడు శ్రీ క్షీర భావన్నారాయణ స్వామి దేవాలయంలోపూజలునిర్వహించానన్నారు. స్వామి వారి అనుగ్రహంతో పార్లమెంట్ సభ్యునిగాను, లోక్ సభలో ప్యానల్ స్పీకర్ గాను ఉన్నానని ఆయన తెలిపారు. ఈ కార్యాక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టి ఛైర్మన్ సలగలరాజశేఖర్ బాబు, పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు భీమా లీలా కృష్ణ, డి రాంమోహన్, రావినూతల నాగేశ్వరరావు, ముచ్వా భరత్ చందు, టి.డి.పి. బిజెపి, జనసేన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కొండవీడు ఇయన్‌టి హాస్పటల్‌లో ఉచిత వినికిడి పరీక్షలు

**నరసరావుపేట, మార్చి 2 ప్రభాతవార్త :** ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా కొండవీడు ఇ.యన్.టి. హాస్పటల్‌లో ఉచిత వినికిడి పరీక్షలను నిర్వహించినట్లు హాస్పటల్ ఛైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలందరికీ, అదే విధంగా 60 సంవత్సరాలు దాటిన వృద్ధులకు ఉచిత వినికిడి పరీక్షలు నిర్వహించామన్నారు. హియరింగ్ పరికరాలు 30 శాతం రాయితీతో అందించామన్నారు. మూడు సంవత్సరాలలోపు వినికిడి సమస్య ఉంటే ఆరోగ్యశ్రీ ద్వారా కాంక్లియర్ ఇంప్లాంట్ సౌకర్యం హాస్పటల్‌లో ఉందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి తెలియజేశారు. పిల్లలకు వినికిడి లోపం ఉంటే శబ్దాలు గుర్తించలేరని, పెదాల కదలికలను మాత్రమే అనుసరిస్తారని తెలియజేశారు. ఆరు నెలల్లోపు పిల్లలు తల్లి మాటలను విని తల తిప్పకపోతే వినికిడి పరీక్షలు చేయించాలన్నారు. పిల్లలకు వినికిడి సమస్యలను పరిష్కరించడంతో పాటు మాటలు రావడం కూడా జరుగుతుందని డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి తెలియజేశారు. ఈ సమావేశంలో డాక్టర్ వర్షిణి, డాక్టర్ విష్ణురాజు, మేనేజర్ మహేష్, అశోక్, ఫార్మసిస్ట్ స్వామి పాల్గొన్నారు.



## రాఘవేంద్ర వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ

**నరసరావుపేట టౌన్, మార్చి 2 ప్రభాతవార్త :** పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న రాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో ఆదివారం వృద్ధులకు ఆర్గానిక్ పండ్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ నిర్వాహకులు పూనూరి కృష్ణకుమారి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. వాసవిక్లబ్ సభ్యులు పన్నెండు రకాల పండ్లను వృద్ధులకు అందించారని తెలిపారు. వృద్ధులకు ఆరోగ్యానిచ్చే బొప్పాయి, కమల, పైనాపిల్, కర్జూరం, కిస్‌మిస్, పుచ్చకాయ, ద్రాక్ష, చెక్కెరకేళి పండ్లను అందజేశారు. దాతలకు ఈ సందర్భంగా పూనూరి కృష్ణకుమారి కృతజ్ఞతలు తెలిపారు. వాసవిక్లబ్ సభ్యులు కనమర్లపూడి శ్రీనివాసరావు, మునగాల చిరంజీవి, చేగు వెంకటేశ్వరరావు, కేశవరావు, పొట్టి వెంకటేశ్వర్లు, అనీల్, సాంబశివరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వల్లభాపురంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**కొల్లిపర, మార్చి 2 ప్రభాతవార్త:** పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మండల పరిధిలోని వల్లభాపురం గ్రామంలో ఆదివారం జరిగింది., 43 ఏళ్ళ తరువాత కలుసుకున్న పూర్వవిద్యార్థులంతా తనతో చదువుకున్న తోటి స్నేహితులను చూసి ఆప్యాయతలతో పలకరించుకున్నారు. అయితే వీరంతా 1981-82 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు.. ఆనాడు చదువుకున్న విద్యార్థులలో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి రాధారాణి కూడా ఒక విద్యార్థినిగా ఉండటం విశేషం..న్యాయమూర్తి రాధారాణి స్వస్థలం తెనాలి కావటం మరో విశేషం. అనంతరం కృష్ణానది తీరాన ఉన్న శ్రీలక్ష్మీతిరపతమ్మ ఆలయాన్ని న్యాయమూర్తి రాధారాణి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## ఆకట్టుకున్న కళారూపాలు

**నరసరావుపేట టౌన్, మార్చి 2 ప్రభాతవార్త :** కోటప్పకొండ తిరునాళ్ళలో సాంప్రదాయ గ్రామీణ కళారూపాలు ప్రదర్శించారని, భక్తులకు, యాత్రికులకు అవి కనువిందు చేశాయని మంచి చిత్రాల అభిమాన సంఘం ప్రతినిధులు ఈదర గోపిచంద్, కె.నాగవీరయ్యలు ఆదివారం తెలియజేశారు. శాలివాహన సత్రం వద్ద కావూరు గ్రామానికి చెందిన 22 మంది కళాకారులు బ్రహ్మం గారి పూర్తి నాటకాన్ని ప్రదర్శించారన్నారు. అదే విధంగా కాకతీయ కళావేదికపై మంచి సినిమా పాటల కచేరి జరిగిందన్నారు. కళాకారులు సింగరకొండయ్య ఆధ్వర్యంలో గయోపాఖ్యాయం, శ్రీకృష్ణరాయభారం, రామాంజనేయయుద్ధం, పౌరాణిక పద్య నాటక సీన్‌లు ప్రదర్శించారన్నారు. నవభారత దివ్యాంగ కళాకారుల సంక్షేమ సంఘం కర్నాటి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మంచి సినిమా పాటల కచేరి, మిమిక్రీ, ఏకపాత్ర అభినయాలు జరిగాయన్నారు. కావూరు ప్రభ వద్ద మహిళా కోలాటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాలలో ప్రతిభ చూపిన కళాకారులకు త్వరలోనే బహుమతులను అందజేస్తామని ఈదర గోపిచంద్‌తో పాటు పద్యకవి ఈపూరి వెంకటరెడ్డి తెలియజేశారు.

## భక్తులకు అన్నదానం

**నరసరావుపేట టౌన్, మార్చి 2 ప్రభాతవార్త :** మండలంలోని ఇస్సపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయం ఎదురుగా ఉన్న ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో ఆదివారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కన్వీనర్ బత్తుల మురళీ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కపలవాయి విజయ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆదివారం అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు, యాత్రికులకు అన్నదానం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను అభినందించారు.

## 9నుండి శ్రీరామనామ పారాయణ యజ్ఞ పూర్ణాహుతి మహోత్సవాలు

**తెనాలి, మార్చి 1 (ప్రభాతవార్త) :** సంసారభవసాగరాన్ని దాటించి మహా మహిమాన్విత తారక మంత్రమైన శ్రీరామ అనే మూడక్షరాలను, భక్తిమీర పలికితెముక్తికి మార్గమై మోక్షగాములుగా మారుస్తుందనే వప్రజ సంకల్పంతో తెనాలి పట్టణం



మరోసారి అటువంటి ఆధ్యాత్మిక వైభవం దిశగా అడుగులు వేస్తుందని శ్రీ విఖనస శ్రీనివాస ట్రస్ట్ కార్యవర్గం పేర్కొంది. ఆధ్యాత్మికంగా ఎంతో విశిష్టతను సంతరించుకున్న శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ కళ్యాణ మండపంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఈనెల 9వ తేది నుండి 14వ తేది వరకు కొత్తపేటలోని తాలూకా హైస్కూల్ గ్రౌండ్స్ లో నిర్వహించనున్న అష్టోత్తర శత కోటి, శ్రీరామనామ పారాయణా మహాయజ్ఞ పూర్ణాహుతి మహోత్సవాల కార్యాచరణనను శ్రీ విఖనస శ్రీనివాసా ట్రస్ట్ కార్యవర్గ ముఖ్యులు వివరించారు. ఆలయ ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అష్టోత్తర శతకోటి శ్రీరామనామ పారాయణను రెండున్నర సంవత్సరాల క్రితం వేలాది మంది భక్తులు శ్రీపంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో ఓదీక్షగా స్వీకరించి ప్రత్యేకంగా రూపొందించిన పత్రికలలో శ్రీరామ తారక మంత్రాన్ని భక్తి శ్రద్ధలతో లిఖించారని ఆ విధంగా పూర్తి చేసిన, నూట ఎనిమిది కోట్ల శ్రీరామ నామపారాయణ పత్రికల శోభాయాత్రతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని అన్నారు. లక్ష హనుమాన్ చాలీసా సామూహిక ఏకకాల పారాయణతో గిన్నీస్ బుక్‌లో తెనాలి ఆధ్యాత్మిక ఖ్యాతిని చాటిన హనుమాన్ భక్తులు వుప్పల వరదరాజులు మాట్లాడుతూ తెనాలి అంటేనే ఆధ్యాత్మిక వికాసమని, శుభం సంకల్పంతో చేపట్టిన నూట ఎనిమిది కోట్ల శ్రీరామనామ పారాయణ మహాయజ్ఞంతో తెనాలికి, ఈసారి శ్రీరామ నవమి నెలరోజులు ముందుగానే రానుందని అన్నారు. ఈ విశేష కార్యక్రమం, తెనాలి పరిసర ప్రాంత ఆధ్యాత్మిక చింతనా పరులకు, ఆధ్యాత్మిక విలువలను ఆనందాన్ని మరింతగా పెంచే కార్యక్రమం కానుందన్నారు. శ్రీ విఖనస శ్రీనివాస ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు ఆర్.వి.కిరణ కుమార్ మాట్లాడుతూ లోక కళ్యాణార్థం తలపెట్టిన ఈ మహాయజ్ఞం ఈనెల 9నుండి 14వ తేది వరకు నిర్వహించే వేదాగమ యజ్ఞ క్రతువు, కళ్యాణ ఉత్సవాలతో పాటుగా సమాజాన్ని భక్తి మార్గం వైపు నడిపించడంలో తమవంతుగా ఆధ్యాత్మిక ప్రవచనాల ద్వారా సేవ చేస్తూ విశిష్టతను సంతరించుకున్న ప్రవచన కర్తల ప్రవచనామృత కార్యక్రమాలు ఉత్సవాలలో ప్రాధాన్యతను సంతరించుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఈవో హరిప్రసాద్, శాండిల్య, జంధ్యం రామారావు, గుంటి వెంకట్, బాలకృష్ణ, ఆర్.శ్రీనివాసమూర్తి, మూర్తి వెంకటేశ్వరరావు, ఆర్.సురేష్ తదితర సభ్యులు పాల్గొన్నారు.

## మోటార్ వాహన చట్టం నిబంధనలు విధిగా పాటించకుంటేనే జరిమానాలమోత : సిఐ రమేష్‌బాబు

**తెనాలి, మార్చి 2 (ప్రభాతవార్త) :** మోటార్ వెహికల్ చట్టం కొత్త నిబంధనల ప్రచారం రూర్స్ అతిక్రమిస్తే వేసే జరిమానా నగదు విలువ, గతంకంటే ఎక్కువగా పెంచడం జరిగిందని, వాహనదారులు చట్టానికి లోబడే వాహనాలు నడపాలన్నదే దీని ముఖ్య ఉద్దేశ్యమని త్రీటౌన్ సిఐ, ఎస్.రమేష్‌బాబు పేర్కొన్నారు. స్థానిక త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో త్రీటౌన్ సిఐ ఎస్.రమేష్‌బాబు మాట్లాడుతూ అతి వేగంతో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, మోటార్ వెహికల్ చట్టం పట్ల అవగాహనా రాహిత్యం, ఏమి జరిగినా అరకొరగా ఉన్న జరిమానా చెల్లించి అదే విదానాన్ని ఎక్కువ మంది అనుసరిస్తున్న క్రమంలో ఉన్నత న్యాయస్థానాల ఆదేశాలతో మోటారు వాహన చట్టం అతిక్రమణకు పాల్పడే వారిపై జరిమానాలు అధికమయ్యాయని, చట్టంలోని విధి విధానాలను సక్రమంగా పాటించాలన్నదే ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఈనెల 1వ తేది నుండి అమలులోకి వచ్చిన, చట్టం పట్ల వాహన దారులు అవగాహన పెంచుకుని చట్టానికి లోబడి తమ వాహనాలు నడపాల్సి ఉంటుందన్నారు. మోటార్ వాహన చట్టం నిబంధనలను అతిక్రమించి వాహనంతో పట్టుబడిన వారికి, నిబంధనల ప్రకారం వేసే జరిమానాలు, ఈసేవా కేంద్రాల్లో చెల్లించాల్సి ఉంటుందని, జరిమానా వేసాక, చెల్లించకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తూ రెండవ సారి తనఖీలలో పట్టుబడితే వాహనం సీజ్ చేస్తామని తెలిపారు. మోటారు వాహన చట్టం నిబంధనలను అతిక్రమించే వారిపై చట్టపరంగా తీసుకునే చర్యలకు వాహనదారులు సిద్ధపడాల్సిందేనని అన్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తితో పాటు వెనుక ఉన్న వ్యక్తికి కూడా కలుపుకుని రెండు వేల వరకు జరిమానా పడుతుందని అన్నారు. భారీ వాహనాలు ఓవర్ లోడింగ్‌తో పట్టుబడితే జరిమానాలు నగదు, గతం కంటే భిన్నంగా భారీగా పెంచడాన్ని, వాహనదారులు గమనించి నిబంధనలు పాటించాలన్నారు. జరిమానాలు భారం అనే భావనతో కాకుండా చట్టాన్ని గౌరవిస్తూ చట్టానికి లోబడి తమ వాహనా ప్రయాణాలు కొనసాగించాలన్నారు. మోటారు వాహన నిబంధన చట్టంలో ఏ అతిక్రమణకు ఎంత జరిమానా అనే విషయాలను సిఐ రమేష్‌బాబు కూలంకషంగా వివరించారు. ఈ సమావేశంలో స్టేషన్ ఎస్సై తదితరులు ఉన్నారు.

## జిల్లా అధ్యక్షునిగా చెరుకూరి తిరుపతిరావు బాధ్యతలు స్వీకరణ

**గుంటూరు విద్య, మార్చి 2, ప్రభాతవార్త :** స్థానిక లాల్‌పురంలోని బిజెపి జిల్లా కార్యాలయం వాజ్‌పేయి భవన్‌లో జిల్లా పరిశీలకులు శ్రీనివాసరాజు, ఎలక్షన్ ఆఫీసర్ చిగురుపాటి కుమారస్వామి, బిజెపి సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షునిగా చెరుకూరి తిరుపతిరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చెరుకూరి మాట్లాడుతూ జిల్లా అధ్యక్షునిగా నాకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తూ నాకు ఈ అవకాశం ఇచ్చిన పార్టీ పెద్దలందరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నా అన్నారు. రాబోయే రోజుల్లో భారతీయ జనతాపార్టీ బలోపేతానికి నావంతు కృషి చేస్తానని పంచాయతీ, మున్సిపాలిటి, కార్పొరేషన్ ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీ జెండాను ఎగురవేసే దిశగా పార్టీని ముందుకు తీసుకెళ్తానన్నారు. బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి బిజెపి సీనియర్ నాయకులు జమ్ముల శ్యామ్‌కిషోర్, నేరెళ్ళ మాధవరావు, కొత్తూరి వెంకట సుబ్బారావు, మకుటం శివ, శనక్కాయల అరుణ, యడ్లపాటి స్వరూపారాణి, ఈదర శ్రీనివాసరెడ్డి, టుబాకో బోర్డు ఛైర్మన్ యశ్వంత్, గాజుల వెంకయ్య నాయుడు, భీమినేని చంద్రశేఖర్, కొక్కెర శ్రీనివాసయాదవ్, పాలపాటి రవికుమార్, జగ్గారపు శ్రీనివాసరావు, జంధ్యాల రామలింగశాస్త్రి, పాండురంగ విఠల్, తీయగూర వెంకట కృష్ణారెడ్డి, చరక కుమార్‌గౌడ్, వై.వి.సుబ్బారావు, చుండూరు ఉమామహేశ్వరావు, శనక్కాయల ఉమాశంకర్, జిల్లా పదాధికారులు, మోర్చా అధ్యక్షులు, అసెంబ్లీ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, మండల అధ్యక్షులు, జిల్లా నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జిల్లా అధ్యక్షునికి అభినందనలు తెలియజేశారు.



## ఊపిరితిత్తుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలి

**గుంటూరు కల్చరల్, మార్చి 2, ప్రభాతవార్త :** అవగాహన సంస్థ ఆధ్వర్యంలో ఊపిరితిత్తులకు కలిగే అనారోగ్య సమస్యలు తీసుకోవలసిన జాగ్రత్తలపై జరిగిన ఆరోగ్యసభలో ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ ఎస్.రఘు ప్రధానవక్తగా పాల్గొని ప్రసంగించారు. మద్యపానం, దూమపానం లాంటి వ్యసనాలకు లోనవ్వకుండా మన చుట్టూ మంచి అహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేసుకుంటే చాలా మంచిదన్నారు. ముఖ్యంగా గాలి ద్వారానే ఊపిరితిత్తులకు వ్యాధులు సంక్రమించే అవకాశం ఎక్కువగా ఉన్నాయన్నారు. కావున బయటకు వచ్చినప్పుడు మాస్క్ ధరిస్తే చాలా ఉత్తమమని సూచించారు. సభలో అవగాహన సభ్యులు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. డాక్టర్ రఘు ని అవగాహన సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సభకు టివి సాయిరామ్ కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, విశ్రాంత ప్రిన్సిపాల్ ముప్పాళ్ళ ప్రసాదరావు అవగాహన సీనియర్ సభ్యులు ఎన్.సాంబశివరావు, పాములరెడ్డి, ఆర్.రామచంద్రరావులు పాల్గొని ప్రసంగించారు.

## 15గొర్రెలను కారులో ఎక్కించుకెళ్ళిన దుండగులు

**సత్తెనపల్లి, మార్చి 2 ప్రభాతవార్త :** ముప్పాళ్ళ మండలం పలుదేవర్లపాడు లో ఆదివారం గొర్రెలు చోరీకి గురయ్యాయి. మందిలో ఉన్న 15 గొర్రెలను గుర్తు తెలియని వ్యక్తులు కారులో ఎక్కించుకెళ్ళినట్లు బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

## జాతీయస్థాయి తెలుగు సినిమా పాటల పోటీలు

**సత్తెనపల్లి, మార్చి 2 ప్రభాతవార్త :** చైతన్య కళా స్రవంతి సత్తెనపల్లి వారి 46వ వార్షికోత్సవం సందర్భంగా కీర్తిశేషులు షేక్.షకీలా బేగం కళావేదిక నందు ఈ నెల 9వ తేదీ ఆదివారం సినిమా పాటల పోటీలు ట్రాక్ ఆధారంగా నిర్వహించడం జరుగుతుందని ప్రధాన కార్యదర్శి జి.అమర్‌నాథ్ తెలియజేశారు. ఈ కార్యక్రమాలు సత్తెనపల్లిలోని ఏఎంఐ ఫంక్షన్ హాల్ సాయిబాబా గుడి ఎదురుగా నిర్వహించడం జరుగుతుందని సంస్థ అధ్యక్షులు లయన్ కమతం శ్రీనివాసరావు తెలిపారు. ఈ పాటల పోటీలలో ప్రథమ బహుమతిగా రూ.5 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.3 వేలు, తృతీయ బహుమతిగా రూ.2 వేలు అందజేయడంతో పాటు ప్రత్యేక బహుమతులు పది మందికి రూ.500ల చొప్పున ఇవ్వడం జరుగుతుందన్నారు.

## మహిళా పోలీసులకు ధ్యానం, యోగాలో శిక్షణ

**నరసరావుపేట క్రైం, మార్చి 2 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా మహిళా పోలీసులకు, సచివాలయ పోలీసులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగా, ధ్యానంలో శిక్షణా కార్యక్రమాన్ని పోలీస్ పేరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలీస్ విధులు ఎన్నో ఒత్తిళ్ళతో మానసిక ఇబ్బందులతో నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఇటువంటి పరిస్థితులలో వారికి యోగా, ధ్యానం ద్వారా ఒత్తిడిని అధిగమించవచ్చన్నారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం ఎంతో అవసరమన్నారు. యోగా, ధ్యానంలో శిక్షణ పొందడం ద్వారా విధుల నిర్వహణలో పనితీరు మెరుగుపడుతుందన్నారు. తప్పనిసరిగా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి రోజూ యోగా, ధ్యానం చేయాలని ఎస్పీ కె.శ్రీనివాసరావు తెలియజేశారు. గురూజీ జనార్ధన్‌రావు యోగా శిక్షణలో పలు సూచనలు చేశారు. అడిషనల్ ఎస్పీ జె.వి.సంతోష్, మహిళా పోలీస్‌స్టేషన్ డిఎస్పీ వెంకటరమణ, 35 మంది మహిళా పోలీసులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



